# చిరస్థాయిగా నిలిచే చరిత్ర పరిశోధకులు దిగవల్లి శివరావు

88 ఏండ్లు నిండిన పండు వృద్ధుడైన దిగవల్లి శివరావుగారు ఈరోజుకూ రోజూ పది గంటలు చదువుకు కేటాయిస్తారు. ఎంత చదువుతారో అంతగా నోట్సు రాస్తారు. సేకరిస్తారు. అలా రాసిన నోట్సు కొన్ని వేల పేజీల్లో వుంటుంది.

చరిత్ర పరిశోధన ఆయన అభిమాన విషయం. తెలుగులో చరిత్ర పరిశోధనని సుసంపన్నం చేయడం వారి జీవిత లక్ష్యం.

1898 ఫిబ్రవరి 14న కాకినాడలో జన్మించిన శివరావుగారు రాజమహేంద్రవరంలోని వీరేశలింగంగారి శిష్యుడు. వారి పాఠశాలలోనే విద్యాభ్యాసంచేసి తరువాత మదరాసు ప్రెసిడెన్సీ కాలేజీలో 'లా' చదివారు. పాఠశాలలో చదువుతున్నప్పుడే వందేవందే సదా– స్వదేశమాతరం గీతం పాడటమే కాదు– పాడుతూ దేశభక్తులయ్యారు.

1922లో మొదట న్యాయవాదిగా బోర్డు కట్టినప్పటికీ చరిత్ర పరిశోధకుడిగా ఎక్కువ కృషిచేసి చరిత్రకారునిగానే ఇప్పటికీ జీవిస్తున్నారు. ఇకముందు అలాగే జీవిస్తారు కూడా. మేజర్ జి.డి.బసూ, ఎడ్వర్డ్ థాంప్సన్‌ల రచనలు భారత జాతీయ దృక్పథంతో చారిత్రక రచనలు చేయడానికి ప్రేరేపించాయి. అది మొదలుగా అసంఖ్యాకమైన చరిత్ర రచనలు చేసి ఎన్నో కొత్త విషయాలు లోకానికి వెల్లడించారు. ఆంగ్లేయులకు వ్యతిరేక రాజకీయాలను చరిత్ర పరిశోధనలోంచి వెలికి తీయడం శివరావుగారి ప్రత్యేకత. ఇండియాలో నివసించిన ఆంగ్లేయ పాలకులు, మిలటరీ అధికారులు మొ. వారి స్వీయచరిత్రల నుండి, ఉత్తర ప్రత్యుత్తరాల నుండి వారి విధానాలకు వ్యతిరేక విషయాలను సేకరించేవారు. మొదటి నుండి వీరి రచనలన్నీ ప్రజలను విషయ విజ్ఞానులుగా చేయడానికి ఎంతో ఉపకరించాయి. రాజకీయ, సాంఘిక, చారిత్రక విషయాలపై వేలాది వ్యాసాలు, వందలాది పుస్తకాలు రాశారు.

1924లో 'పోతన వేమనల యుగం' పుస్తకం రచించారు. 1985లో సంచలనం రేకెత్తించిన 'వీరేశలింగం వెలుగునీడలు' పుస్తకం రచించి రచనా వ్యాసాంగానికి షష్టిపూర్త్యుత్సవం చేసుకున్నారు.

1923–33 వరకు ప్రకాశం నడిపిన 'స్వరాజ్య' పత్రికకు పది సంవత్సరాలు ప్రత్యేక విలేకరిగా పనిచేశారు.

వీరు రాసిన పది కరపత్రాలపై జిల్లా కలెక్టర్ సెడిషన్ కేసు పెట్టారు. వాటిపై ఆంక్షలు, శిక్షలు విధించారు. 1932లో గాంధీ–ఇర్విన్ ఒడంబడిక వల్ల ప్రత్యేక ప్రభుత్వ ఆజ్ఞతో కేసు కొట్టివేశారు. పోలీసుల కళ్లలో బలంగా పడటంవల్ల ఆ తరువాత కొంతకాలం రహస్యంగానే చురుకైన కార్యక్రమాలు నిర్వహించారు.

ఆంధ్రరాష్ట్ర రైతు సంఘంవారు 'నూతన ఇండియా రాజ్యాంగం' అనే వీరి పుస్తకాన్ని ప్రచురించింది. రష్యా విప్లవం విజయవంతమై సోషలిజం పంథాలో విజయయాత్ర సాగిస్తున్న తరుణంలో 'నవీన రష్యా ఆర్థిక నీతి' అనే పుస్తకం రాశారు. ఆంధ్రదేశంలో అప్పటికింకా సోషలిస్టు భావాలు అంతగా ప్రచారం కాలేదు.

భారతి, ప్రజామిత్ర మొ. పత్రికలు

ప్రారంభించిన నాటినుండి వీరు ఎన్నోవ్యాసాలు రాశారు. చరిత్రకారునిగా నిలదొక్కుకుంటూనే అనేక విషయాలపై పత్రికల్లో వ్యాసాలు రాసేవారు. 1941లో కృష్ణా పత్రికలో 'ఇంగ్లీషు చదువులు—చరిత్ర' పేరుతోనూ, 'విస్సన్న చెప్పింది వేదం— విన్సెంట్ స్మిత్ రాసింది చరిత్ర' పేరుతోనూ వ్యాసపరంపర వెలువడింది. 1943లో నూరేళ్ల నాటి... శీర్షికన ఆంధ్రసచిత్ర వారపత్రికలో అనేక వ్యాసాలు ప్రచురించారు. 1943–45వరకు 'కథలు—గాథలు' ప్రచురించారు. ఏది రాసినా, ఏ పనిచేసినా 'విజ్ఞాన వంతులవుతూ విజ్ఞాన వంతుల్ని చేయడం' అనే ఆదర్శం కోసమే.

1940 తరువాత కోర్టు, ఇల్లు, చదువు అనే ముక్కోణపు కార్యక్రమంలో పడిపోయారు. ఐనప్పటికీ ఎక్కువ కాలాన్ని చదవడానికి కేటాయించేవారు. నాయకుల ఆలోచనల కన్నా ఎంతో ముందుగా వీరి రచనలు వెలువడటం విశేషం. విశ్వనాథ వారి 'ప్రళయ నాయుడు' నవలకి శివరావుగారి చరిత్ర నేపథ్యమే మూలం. నవలా రచనకి ప్రేరణ అయిన శివరావుగారికే ఆ నవలని అంకితం చేశారు.

తెలుగు సాంఘిక చరిత్రకి శివరావుగారు పరోక్షంగా చేసిన సహాయం ఏనుగుల వీరాస్వామయ్యగారి 'కాశీయాత్ర చరిత్ర' ప్రచురణ. ఎన్నో వివరాలు సేకరించి, విపులమైన వ్యాఖ్యానంతో, విలువైన విషయాలు చేర్చి, విలువైనపీఠికనిజోడించి లోకానికిఅందించారు.

వేలూరి శివరామశాస్త్రి, వేటూరి ప్రభాకరశాస్త్రి వంటి పండితులు, సోమశేఖర శర్మ వంటి చరిత్ర పరిశోధకులు శివరావుగారి కృషికి తగిన పీఠం వేశారు.

ఆచార్య రంగా నడిపే రైతాంగ విద్యాలయంలో శివరావుగారు రాసిన పుస్తకాలు పాఠ్య పుస్తకాలుగా ఉండేవి ప్రస్తుతం గత చరిత్రని భవిష్యత్తుకు అందించాలని ప్రయత్నిస్తున్నారు.

చరిత్రకు సంబంధించి విషయమే ఎక్కువగా ఉంటాయన్నారు. అప్పట్లో కాంగ్రెసు ఉద్యమానికి స్వచ్ఛందంగా, త్యాగంతో పని చేసిన శివరావుగారు ఇప్పుడా కాంగ్రెస్‌పార్టీలో, నాయకుల్లో లోపించిన నిజాయితీని నిరసిస్తారు.

బంగోరేకి శివరావుగారు చాలా నచ్చారు. తన 'తాతాచార్యుల కథలు' అంకితం చేశాడు. ఇద్దరూ చరిత్ర పరిశోధకులే. ఇద్దరికీ సమాజంపై, ప్రజల్ని పాలించే వ్యవస్థపై తీరని అసంతృప్తి, మనుషుల అల్పత్వాలపై, నిజాయితీ రాహిత్యంపై, ద్వంద్వ ప్రవృత్తిపై ద్వేషం. వేలాది పేజీల అమూల్యమైన నోట్సు వారి బీరువాల్లో మూలుగుతోంది. వేలాది పుస్తకాలున్న వారి స్వంత గ్రంథాలయాన్ని న్యాయవాద వృత్తి చేస్తున్న వారి కుమారుడు దిగవల్లి వెంకటరత్నంగారు ఎంతో జాగ్రత్తగా సంరక్షిస్తున్నారు. వీరు తండ్రిగారి వ్యాసాలకు, నోట్సుకి పట్టికలు తయారు చేశారు. శివరావుగారి రచనలు, నోట్సు, పుస్తకాలు అన్నీ కలిపి చరిత్ర పరిశోధకులకి విలువైన 'స్మారకగ్రంథాలయం'గా ఏర్పాటు చేయాలని దృఢదీక్షతో వున్నారు.

– జయధీర్ తిరుమల రావు